

భారతీయ ధర్మం గొప్పది

ప్రపంచంలోనే భారతీయ ధర్మం చాలా గొప్పదని ప్రముఖ కవి, విమర్శకుడు గంట మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



'అభయహస్తం' అందేనా?

అభయ హస్తం పథకంలో భాగంగా తాము చెల్లించిన డబ్బును వడ్డీతో సహా తిరిగి ఇవ్వాలని మహిళలు కోరుతున్నారు. 8లో▸



రేషన్ కార్డులతో..

కొత్త రేషన్ కార్డుల పంపిణీతో పేదలకు మేలు కలుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అనంతగిరి: భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా ఆస్తి నష్టం, రోడ్లు దెబ్బతిన్నా, ఇతర సహాయం కోసం కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సూచించారు. 08416 242136, 79950 61192 ఫోన్ నంబర్లలో అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

నేడు పరిగికి మంత్రి శ్రీధర్‌బాబు రాక

పరిగి: మండలంలోని తుంకుల్‌గడ్డకు గురువారం ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రానున్నట్లు ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు తుంకుల్‌గడ్డలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం దోమ మండల కేంద్రంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు.

దోమ మండలానికి..

దోమ: మండల కేంద్రానికి గురువారం మంత్రి శ్రీధర్‌బాబు రానున్నట్లు తహసీల్దార్ గోవిందమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోత్కూర్ గ్రామ పరిధిలోని చెంచుకాలనీలో రూ.40 లక్షలతో ట్రైబల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు, మహిళా సంఘాల సభ్యులకు రుణ చెక్కులు అందజేస్తారన్నారు.

సీఎంను కలిసిన దౌల్తాబాద్ నాయకులు



దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బుధవారం నగరంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ముఖ్యమంత్రికి వివరించారు. కొడంగల్ కడా కార్యాలయంలో సమస్యలపై వినతిపత్రం ఇస్తే పరిష్కరిస్తారని సీఎం హామీ ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రావు, వెంకట్‌రెడ్డి, ప్రమోద్‌రావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్



మాట్లాడుతున్న వేణుగోపాల్

దౌల్తాబాద్: ఉపాధ్యాయులకు బదిలీలతో కూడిన పదోన్నతులు కల్పించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని టీఎస్ ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లుల కోసం చాలా మంది ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. హెల్త్‌కార్డులపై వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు. సీపీఎస్ రద్దు చేయాలన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒక్కసారి ఇచ్చే కరువు భత్యం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యవర్గ సభ్యుడు పవన్‌కుమార్, ఉపాధ్యక్షులు ఊషన్న, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

పూడూరు: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు తహసీల్దార్ భరత్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. బదిలీలు, పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మోహిజ్‌ఖాన్, మండల అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్, వెన్నెల సత్యం, సమద్ తదితరులు పాల్గొన్నారు.

జల పరవళ్లు

- జిల్లాలో విస్తారంగా వానలు
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- చెరువుల్లోకి చేరుతున్న వరద
- కొట్టుకుపోయిన రోడ్లు
- పలుచోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- పలు కాలనీలు జలమయం
- లోటు నుంచి అధిక వర్షపాతం నమోదు



తాండూరు మండలం బెల్కటూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

వికారాబాద్: జిల్లాలో రెండు రోజులుగా కుండపోత వర్షం కురుస్తోంది. దీంతో జన జీవనం స్తంభించిపోయింది. మంగళవారం భారీగా పడి బుధవారం కాస్త నెమ్మదించింది. కొన్ని చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. దీంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరుతోంది. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులకు భారీగా నీరు చేరుతోంది. పలుచోట్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గడిచిన రెండు రోజుల్లో తాండూరులో 105.3, దౌల్తాబాద్‌లో 104.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 11 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా 9 మండలాల్లో లోటు, 12 మండలాల్లో అధిక వర్షపాతం నమోదయ్యింది. ఒక్క బంట్వారం మండలంలో మాత్రమే లోటు వర్షపాతం కనిపిస్తోంది.

ముందస్తు చర్యలు

జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్న సమాచారంతో కలెక్టర్, ఎస్పీ అప్రమత్తమయ్యారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని సమాయత్తం చేశారు. జిల్లాలో ప్రమాదకర వాగులు, బ్రిడ్జీలు, 50కి పైగా స్థలాలను గుర్తించారు. అక్కడ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. వానలు తగ్గే వరకు ఎవరూ బయటికి రావొద్దని, ఉధృతంగా ప్రవహించే వాగులను దాటొద్దని సూచించారు. ప్రమాదకర వాగులు, వంకల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జిల్లాలోని కోట్‌పల్లి, లఖ్నాపూర్, జుంటుపల్లి, శివసాగర్, శివారెడ్డిపేట్ ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

కాగ్నా, మూసీ, ఈసీ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రైతులు పొలాల్లోకి, పాదచారుల ఇళ్ల నుంచి బయటికి రాలేకపోతున్నారు.

- ధారూరు మండలం దోర్నాల, రుద్రారం, నాగసముందర్, పరిగి, గొడుగోనిపల్లి, గెర్‌గేట్‌పల్లి, ధన్నారం మార్గాల్లోని వాగులు పొంగిపొర్లుతున్నాయి. వికారాబాద్ మండలం గోధుంగూడ రైల్వే అండర్ బ్రిడ్జిలో బురద ఇరుక్కుపోవడంతో రాకపోకలు బందయ్యాయి.
- తాండూరు నియోజకవర్గంలో అతి భారీ వర్షం కురిసింది. కాగ్నా పరవళ్లు తొక్కుతోంది. బషీరాబాద్, యాలాల, తాండూరు మండలాల్లో కాగ్నా ఉధృతంగా ప్రవహిస్తోంది. జిల్లాలోని పలు కాలనీలు జలమయమయ్యాయి.
- భారీ వర్షాలకు చాలా రోడ్లు దెబ్బతిన్నాయి. గండ్లు పడి రాకపోకలు ఆగిపోయాయి. మూసీ పరీవాహక ప్రాంతంలో పంట పొలాలు నీట మునిగాయి.

జిల్లాలో గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం మిల్లీమీటర్లలో..

మండలం పేరు	22వతేదీ	23వ తేదీ	స్టేటస్
మర్పల్లి	26	1.4	సాధారణం
మోమిన్‌పేట్	22	4.9	అధికం
నవాబుపేట	6.4	6	అధికం
వికారాబాద్	14.5	45	సాధారణం
ధారూరు	20	74.7	అధికం
కోట్‌పల్లి	3.6	23.5	సాధారణం
బంట్వారం	4.2	17.1	లోటు
పెద్దేముల్	49.9	43.6	సాధారణం
తాండూరు	105.3	65	అధికం
బషీరాబాద్	4.8	24.5	సాధారణం
యాలాల	71.4	59.4	అధికం
కొడంగల్	76.9	23.8	అధికం
దౌల్తాబాద్	104.8	15.8	అధికం
చౌడాపూర్	39	35	సాధారణం
దుద్యాల్	54	20.3	అధికం
పూడూరు	45.1	51.6	అధికం
పరిగి	41.3	56.2	అధికం
కుల్కచర్ల	43.4	24.9	సాధారణం
దోమ	67	34.5	అధికం
బొంరాస్‌పేట	39.3	25	అధికం

మెరుగైన వైద్యం మన బాధ్యత

జిల్లా వైద్యాధికారి లలితాదేవి

మోమిన్‌పేట: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం మన బాధ్యత అని డీఎంహెచ్ఓ లలితాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందాలని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలని, ఏ ఒక్క గర్భిణిని ప్రైవేటుకు పంపరాదన్నారు. అవసరం అయితే సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి పంపాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అన్ని రకాల మందులు అందుబాటులోని ఉన్నాయన్నారు. అనంతరం ఆస్పత్రిని, రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ సుజల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రిజిస్టర్ పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ లలితాదేవి

మహిళల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతం కావడంతో బుధవారం పరిగి బస్టాండ్‌లో ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిగి నియోజకవర్గంలో కోటి 29లక్షల మంది మహిళలు ఉచిత బస్సు పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. మహిళల పేరిటే అన్ని పథకాలు అమలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణ అభివృద్ధి చెందుతోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. పరిగి బస్టాండ్‌లో సమస్యలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మెడికల్ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, వైద్యాధికారులు

త్వరలో 'మెడికల్' తరగతులు

- భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి
- డీహెచ్, ఎంసీహెచ్‌లలో మెరుగైన వైద్యసేవలు అందించాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్

తాండూరు టౌన్: తాండూరు పట్టణ శివారులో కొడంగల్ ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను బుధవారం కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. తరగతి గదులు, గ్రంథాలయం, ప్రొజెక్టర్ రూంతో పాటు నిర్మాణ దశలో ఉన్న హాస్టల్ భవనాన్ని సందర్శించారు. విద్యార్థుల సంఖ్య, వారికి అందించాల్సిన సౌకర్యాలపై ప్రిన్సిపాల్ డాక్టర్ రాజును అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొన్ని వారాల్లో భవన నిర్మాణం పూర్తవుతుందన్నారు. కౌన్సెలింగ్ అనంతరం ఈ ఏడాది మెడికల్ కళాశాల తరగతులు ఇక్కడే ప్రారంభమవుతాయన్నారు. టీచింగ్, నాన్ టీచిం గ్ స్టాఫ్ సిద్ధంగా ఉన్నారన్నారు. టీచింగ్ స్టాఫ్‌కు మరో భవనంలో వసతి ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. పనుల్లో ఏమాత్రం అశ్రద్ధ వహించరాదని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

జిల్లా ఆస్పత్రి, ఎంసీహెచ్‌ల తనిఖీ

పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి, మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు అందుబాటులో ఉండాలని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తగిన మందులు సిద్ధంగా ఉంచుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ సునీతను ఆదేశించారు. వైద్య సేవల్లో ఎలాంటి లోటుపాట్లు కలగకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఆస్పత్రి పైభాగంలో వర్షపు నీరు నిలవకుండా మరమ్మతులు చేయించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆస్పత్రుల భవనాలను బాగు చేయించాలని పంచాయతీ రాజ్ ఈఈ ఉమేష్‌ను ఆదేశించారు.

వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. పిడుగులు పడే సమయంలో చెట్ల కిందకు వెళ్లరాదన్నారు. విద్యుత్ స్తంభాలను తాకరాదని తెలిపారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, వంకలు, వరదను దాటే ప్రయత్నం చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, తహసీల్దార్ తారాసింగ్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి

అనంతగిరి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధ వారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్లు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధులు, ఎల్ఆర్ఎస్‌పై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, వార్డు ఆఫీసర్లు, గ్రామ పంచాయతీల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అలసత్వం వద్ద న్నారు. వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యా ధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం లోపించకుండా చూసుకో వాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్డీఓ శ్రీనివాస్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీపీఓ జయసుధ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సమక్షంలో చేరికలు

బంట్వారం: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బుధవారం తెలంగాణ భవన్‌లో బంట్వారం, కోట్‌పల్లి మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు గులాబీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి పార్టీ కండువాలు కప్పారు. పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలన్నారు. మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్‌దే అధికారమన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించి మెజార్టీ స్థానాలను గెలుపొందాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ఉన్నారు. పార్టీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్, బంట్వారం అధ్యక్షుడు మల్లేశం ఆధ్వర్యంలో ఆయా పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో చేరారు.



నాయకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

ఎన్కతలను సందర్శించిన కేంద్ర బృందం

మోమిన్‌పేట: మండలంలోని ఎన్కతల గ్రామాన్ని బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం సందర్శించింది. బృందం సభ్యుడు ఆర్‌ఐ కృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలో కలియతిరిగారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలు, వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలన్నారు. ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ జిల్లా కోఆర్డినేటర్ రవి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, గ్రామ ప్రత్యేకాధికారి యాదగిరి, ఏపీఓ శంకర్, కార్యదర్శి నర్సింలు, టీఏ గంగయ్య, ఫీల్డ్‌అసిస్టెంట్ పోచయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు



శ్రీవారి సన్నిధిలో కలెక్టర్ ప్రతీక్‌జైన్



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కొడంగల్: పట్టణంలో కొలువుదీరిన శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. వరాహస్వామి ఆలయ ఆవరణలోని యాగశాలలో పూర్ణాహుతి సమర్పించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ రాత్రి శ్రీవారిని దర్శించుకున్నారు. ముగింపు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు.

ఉద్యానానికి ఊతం..

- జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచే దిశగా చర్యలు
- 80 నుంచి 100 శాతం రాయితీతో స్ప్రింకర్లు, డ్రిప్ పరికరాలు
- 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి దరఖాస్తుల స్వీకరణ
- పండ్లు, పూల తోటలు, కూరగాయల సాగుకు వర్తించేలా..
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



నవాబుపేట మండలంలో సాగు చేసిన కాకరకాయ పంట

వికారాబాద్: ఉద్యానవన పంటలకు ఊతమిచ్చేదిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రాష్ట్ర రాజధానికి దగ్గరగా ఉన్న వికారాబాద్ జిల్లాలో ఈ తరహా పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు అధికారులు రైతులను సమాయత్తం చేస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్ వాసుల కూరగాయల అవసరాలు నగర చుట్టుపక్కల జిల్లాల రైతులు 50శాతం కూడా తీర్చలేకపోతున్నారు. రంగారెడ్డి, వికారాబాద్, భువనగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాల నుంచి 50 శాతంలోపే నగరానికి వస్తున్నట్లు సమాచారం. మిగిలిన అవసరాలను పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. పూర్తిస్థాయిలో నగర అవసరాలను తీర్చేలా జిల్లా రైతులను ప్రోత్సహించడం ద్వారా మన ఆదాయం కూడా గణనీయంగా పెంచుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ దిశగా ఉద్యానవన శాఖ కసరత్తు చేస్తోంది.

సాగు విస్తీర్ణం రెండింతలయ్యేలా..

నగర సమీప జిల్లాలతో పోలిస్తే కూరగాయల సాగుకు అనువైన.. సారవంతమైన భూములు మన జిల్లాలోనే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఉద్యాన వన పంటల సాగును ఏటేటా పెంచుతూ సమీప భవిషత్తులో రెండింతలు సాగయ్యేలా ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను రైతులకు వివరిస్తున్నారు. సాగుకు వినియోగించే యంత్ర పరికరాలను 80 నుంచి 100 శాతం రాయితీపై అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా 2025 – 26 ఆర్థిక సంవత్సరానికిగాను రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం ప్రారంభించారు.

ఉద్యాన సాగుపై మక్కువ

జిల్లా రైతులు దశాబ్ద కాలంగా ఉద్యానవన పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. కూరగాయలు, పూలు, పండ్ల తోటలను ఎక్కువగా పెంచుతున్నారు. సుగంధ ద్రవ్యాల సాగు చాలా వరకు తగ్గిపోయింది. జిల్లాలో ప్రస్తుతం 49,495 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగవుతుండగా ఇందులో 15,265 ఎకరాల్లో పండ్ల తోటలు ఉన్నాయి. 27,125 ఎకరాల్లో కూరగాయలు సాగుచేస్తున్నారు. సుగంధ ద్రవ్య పంటలైన పసుపు, అల్లం 6,254 ఎకరాల్లో సాగవుతున్నాయి. 851 ఎకరాల్లో పూలతోటలు సాగుచేస్తున్నారు.

రాయితీతో పరికరాలు

ఉద్యాన సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 80 శాతం నుంచి 100 శాతం రాయితీతో స్ప్రింకర్లు, డ్రిప్ పరికరాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ ఏడాదికి గాను 525 ఎకరాలకు డ్రిప్ పరికరాలు, 500 ఎకరాలకు స్ప్రింక్లర్లను ఇవ్వాలని టార్గెట్ పెట్టుకున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీపై, బీసీ, ఓసీ, సన్న చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై ఇవ్వనున్నారు. ఓసీ, బీసీ, పెద్ద రైతులకు 80 శాతం రాయితీపై ఈ పరికరాలు ఇస్తారు. ఒక్కో రైతుకు గరిష్టంగా ఐదు ఎకరాల వరకు రాయితీ వర్తించనుంది.

జిల్లాలో పండ్ల తోటల సాగు 15,265 ఎకరాల్లో
కూరగాయలు 27,125 ఎకరాల్లో
సుగంధ ద్రవ్యాలు 6,254 ఎకరాల్లో
పూలతోటలు 851 ఎకరాల్లో

దరఖాస్తు చేసుకోవాలి



ఉద్యాన పంటల సాగుకు అవసరమైన పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. ఈ ఏడాదికి గాను బడ్జెట్ కేటాయించింది. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలి. నియోజకవర్గ స్థాయిలోని ఉద్యానవన శాఖ అధికారుల వద్ద దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయి. పట్టదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా బుక్ జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేయాలి.

– సర్దార్, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి

క్లుప్తంగా

వర్షం కురిసే.. రైతు మురిసే



సోమ్లానాయక్ తండాలో మొక్కజొన్న పంటలో కలుపు తీస్తున్న కూలీలు

దుద్యాల్: వర్షాకాలం ప్రారంభం నాటి నుంచి అప్పుడప్పుడు పడిన వానలతో రైతులు సాగుకు సమాయత్తం అయ్యారు. సరైన వర్షాలు లేక పంటల ఎదుగుదలకు ఆటంకం ఎదురైంది. ఈ దశలో ఇటీవల కురిసిన వానలు పంటలకు ఊతమిచ్చాయి. జల వనరులు పెరగడంతో పంటలు ఆకు పచ్చని రంగుతో కళకళలాడుతున్నాయి. అన్నదాతలు ఆనందంతో వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. ఆరుతడి పంటలైన పెసర, కంది, బొబ్బర్లు, పత్తి, మొక్కజొన్న వంటి పలు పంటలకు సమృద్ధిగా నీరు అందుతోంది.

జీతాలు ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది

తాండూరు టౌన్: జీతాలు ఇప్పించాలంటూ తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులైన సెక్యూరిటీ గార్డులు, సానిటేషన్ సిబ్బంది తదితరులు బుధవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత ఐదు నెలలుగా ఏజెన్సీ వారు జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందికరంగా ఉందన్నారు. వెంటనే జీతాలు చెల్లించేలా ఏజెన్సీ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. నిర్వాహకులు జీతాలు చెల్లించేలా తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

నిష్ణాతులుగా తీర్చిదిద్దుతాం



కార్యక్రమంలో చాన్స్‌లర్ కోహ్లి, ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం: గురునానక్ విద్యార్థులను ప్రపంచ స్థాయి ప్రొఫెషనల్స్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా విద్యాబోధన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆ యూనివర్సిటీ చాన్స్‌లర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లి అన్నారు. బీటెక్ విద్యార్థుల కోసం సాప్ భాగస్వామ్యంతో రూపొందించిన ఆధునిక కోర్సుల ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ట్రైనింగ్, ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ వినయ్ చోప్రా మాట్లాడుతూ.. ఉద్యోగావకాశాలు మెరుగుపర్చేందుకు ఇది ఎంతో దోహదపడుతుందని తెలిపారు.

రౌడీషీటర్లు నేర ప్రవృత్తి వీడాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ జానకీరెడ్డి

పహాడీషరీఫ్: రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనను అలవర్చుకోవాలని మహేశ్వరం డివిజన్ ఏసీపీ జానకీరెడ్డి సూచించారు. బోనాలు, గణేష్ చతుర్థిని పురస్కరించుకొని బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్‌తో కలిసి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉండాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం, సామాన్యుల పట్ల గూండాయిజం చేస్తే ఉక్కుపాదంతో అణచి వేస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రాత్రిపూట రోడ్లపైకి రాకుండా ఇంటి వద్దే ఉండాలన్నారు. పోలీసులు ఎప్పుడు పిలిచినా వెంటనే పోలీస్‌స్టేషన్‌కు రావాలని పేర్కొన్నారు.

జోరు వాన.. వెతలు తీరేనా!

- తాండూరు-కరన్‌కోట్ మధ్య నిలిచిన రవాణా వ్యవస్థ
- బెల్కటూర్ వంతెన పక్కన కొట్టుకుపోయిన రోడ్డు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- పలుచోట్ల నీట మునిగిన పంటలు
- జలదిగ్బంధంలో చిక్కుకున్న లోతట్టు ప్రాంతాలు



ధారూరు: వరద నీటితో చిక్కుకున్న బస్టాండ్

తాండూరురూరల్/ధారూరు/దుద్యాల్/దౌల్తాబాద్/: భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా జనజీవనం అతలాకుతలం అవుతోంది. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వానలకు వాగులు, వంకలు, కాలువలు పొంగి పొర్లుతున్నాయి. రహదారులన్నీ జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. బుధవారం తాండూరు మండలంలో కుండపోత వర్షం కురిసింది. బెల్కటూర్-కరన్‌కోట్ మార్గంలో వాగుపై వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వాగు ఉధృతంగా ప్రవహించడంతో మంగళవారం రాత్రి తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ, కరన్‌కోట్ శివారులో సీసీఐ, తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీలు రాకపోకలు నిలిచాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వీడి త్వరగా వంతెన పనులు పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బురదమయంగా గ్రామీణ రోడ్లు

దుద్యాల్ మండల పరిధిలోని ఆలేడ్ గ్రామ శివారులో ఉన్న శ్మశానవాటిక చుట్టూ నీరు చేరడంతో అటుగా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే మండలంలోని కుదురుమల్ల, లగచర్ల గ్రామాల్లో రోడ్లపై వర్షం నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో దోమలు ఉత్పన్నమై వ్యాధులు సంక్రమించే అవకాశాలున్నాయి. లగచర్ల ప్రాథమిక పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో ఉదయం ప్రార్థన చేయలేకపోతున్నారని విద్యార్థులు అవస్థలు పడ్డారు. అధికారులు స్పందించి రోడ్లలో నీరు నిలువకుండా మరమ్మతులు చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

బోర్ల కింద నాట్లు ముమ్మరం

దౌల్తాబాద్ మండలంలో గత రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. ఆయా గ్రామాల్లోని చెరువులు పొంగి పొర్లుతున్నాయి. తిమ్మాయిపల్లి గ్రామంలో వర్షానికి పత్తి, పెసర, వరి పంటలు మునిగిపోయాయి. దీంతో రైతన్న ఆందోళన చెందుతున్నారు. బోరుబావుల్లో నీటి మట్టం పెరగడంతో రైతులు బోర్ల కింద వరినాట్లు ముమ్మరం చేశారు.

మునిగిపోయిన బస్టాండ్

భారీ వర్షానికి ధారూరు ఆర్టీసీ బస్టాండ్ పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకుంది. పైనుంచి వరద నీరు రావడంతో బస్టాండు మునిగిపోయింది. తాండూరు, వికారాబాద్, హైదరాబాద్‌ల నుంచి వస్తున్న బస్సులన్నీ రోడ్డుపైనే ఆగి వెళ్లాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు.

కూలిన ఇంటి పైకప్పు



కుల్కచర్ల: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఇల్లు కూలిన ఘటన మండలంలోని కుస్మసముద్రం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎల్లేరి జయలక్ష్మి ఇంటి పైకప్పు బుధవారం కూలిపోయింది. కాగా కుటుంబీకులు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది.



తాండూరు రూరల్: బెల్కటూర్ వంతెన వద్ద కొట్టుకుపోయిన రోడ్డు



దౌల్తాబాద్: తిమ్మాయిపల్లిలో నీట మునిగిన పెసర పంట



తాండూరు రూరల్: బెల్కటూర్ వాగు వద్ద నిలిచిన లారీలు



దుద్యాల్: ఆలేడ్ శ్మశానవాటిక చుట్టూ చేరిన వర్షపు నీరు



దుద్యాల్: లగచర్లలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

భారతీయ ధర్మం చాలా గొప్పది

ప్రముఖ కవి మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

మోమిన్‌పేట: ప్రపంచంలోనే భారతీయ ధర్మం చాలా గొప్పదని ప్రముఖ కవి, విమర్శకుడు గంట మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చక్రంపల్లి భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో పద్య పద భారతి సహిత్య సంస్థ ఆధ్వర్యంలో శత కవి కళాకారుల సమ్మేళనం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కవులు కవితలు, పాటలు, కీర్తనలు, పద్యాలను వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే భారతీయ ధర్మం గొప్పదని, ప్రపంచం కన్ను తెరవక ముందే భారత దేశంలో జ్ఞాన దీప్తి వెలుగొందిందన్నారు. మన పండుగల వైభవాన్ని, సంస్కృతి, సంప్రదాయలను గుర్తు చేశారు. దేవాలయాల నిర్మాణంలో దాగి ఉన్న గొప్పతనాన్ని దేహంతో పోల్చి వివరించారు. కార్యక్రమంలో పద్యపద భారతి అధ్యక్షులు రాఘవచార్యులు, తూర్పు మల్లారెడ్డి, ఉపన్యాసకుడు నర్సింహారెడ్డి, కార్యదర్శి డాక్టరు మున్నూరు రాజు, ఉపాధ్యక్షుడు విశ్వనాథం, సభ్యులు సత్యం, మాణిక్యరావు, వెంకటరెడ్డి, వెంకట్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన కవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో యువకుడి మోసం

- మనస్తాపంతో పురుగు మందు తాగిన యువతి
- చికిత్సపొందుతూ మృతి
- పీర్లగుట్టతండాలో విషాదం
- కేసు నమోదు చేసిన పోలీసులు



లక్ష్మి (ఫైల్)

దోమ: ప్రేమించిన యువకుడు పెళ్లికి నిరాకరించాడని, మనస్తాపానికి గురైన ఓ యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దతండా అనుబంధ గ్రామమైన పీర్లగుట్టతండాకు చెందిన నేనావత్ హరిచందర్, సోనీబాయికి నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడు సంతానం. వీరిలో చిన్న కుమార్తె లక్ష్మి(19) ఇంటి వద్దే ఉంటూ టైలరింగ్ పనులు చేసేది. ఈ క్రమంలో గోన్యానాయక్‌తండాకు చెందిన కేతావత్ రాహుల్‌తో మూడేళ్ల క్రితం ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. అనంతరం టైలరింగ్ మానేసిన లక్ష్మి హైదరాబాద్ వెళ్లి ప్రైవేటు ఉద్యోగంలో చేరింది. ఈ విషయం తెలుసుకున్న రాహుల్ సైతం అక్కడికి చేరుకుని క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో చేరిన కొద్ది రోజులకే మనం కొత్త కారు తెచ్చుకుందాం.. డబ్బులు ఇవ్వమని లక్ష్మిని అడిగాడు. దీంతో స్వగ్రామానికి వచ్చిన ఆమె మూడు తులాల బంగారం, రూ.30 వేల నగదు తీసుకు వచ్చి అతనికి ఇచ్చింది. బోనాల పండుగ నేపథ్యంలో పది రోజుల క్రితం లక్ష్మి ఇంటికి వచ్చేసింది. ఈ నెల 20న ఆమెకు ఫోన్ చేసిన రాహుల్.. మీది నేనావత్.. మాది కేతావత్ మనం పెళ్లి చేసుకోలేం అని తేల్చిచెప్పాడు. దీంతో మోసపోయానని గుర్తించిన ఆమె తీవ్ర మానసిక క్షోభకు గురైంది. కనీసం తాను ఇచ్చిన బంగారం, డబ్బులు తిరిగిస్తే కుటుంబ సభ్యులకు ఇచ్చేస్తానని రాహుల్‌ను కోరింది. ఇందుకు అతను ససేమిరా అనడంతో తండా సమీపంలోని ఓ మామిడి తోటలోకి వెళ్లి పురుగుల మందు తాగింది. ఇది గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు పరిగి ఆస్పత్రికి, అక్కడి నుంచి వికారాబాద్‌లోని మిషన్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి లక్ష్మి మృతి చెందింది. తమ కూతురు మృతికి కారణమైన కేతావత్ రాహుల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని లక్ష్మి తల్లి సోనీబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మి మృతితో తండాలో విషాదం నెలకొంది.

గంజాయి విక్రేతల అరెస్టు

- బీదర్ నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్న నిందితులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాస్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

పూడూరు: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి కటకటాలపాలు చేసిన చేసిన సంఘటన చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ మేరకు పరిగి కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. పూడూరు మండల పరిధిలోని ఎన్కేపల్లి హనుమాన్ దేవాలయం సమీపంలో గంజాయి రవాణా చేస్తున్నారని పక్కా సమాచారం వచ్చిందన్నారు. ఈ క్రమంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించారు. వారిని తనిఖీ చేయగా 1.115 కిలోల గంజాయి లభ్యమైంది. విచారించగా మన్నెగూడకు చెందిన ఎండీ సలీమ్, వికారాబాద్ మండలం ఎన్నేపల్లికి చెందిన ఐజాజ్‌ఖాన్, వికారాబాద్‌కు చెందిన రాహుల్ అలియాస్ హర్షగా గుర్తించారు. ముగ్గురు కలిసి కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి గంజాయిని తెచ్చి మన్నెగూడ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు వివరించారు. పోలీసులు గంజాయి, 3 సెల్‌ఫోన్‌లు, కారు స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్ చేసినట్లు తెలిపారు. ఉన్న మరో వ్యక్తి పరారయ్యాడు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ భరత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

దుద్యాల్: భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ యాదగిరి సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురవడంతో ఇప్పటికే చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారుతున్నాయని, మరో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. చెరువులు, కుంటలు పొరుతున్న సమయంలో ఆలుగు దగ్గరకు వెళ్ల కూడదని, వరద ప్రవాహం ఉన్న వంతెనలు, కల్వర్టుల దగ్గరకు దూరంగా ఉండాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండకూడదని, తడిగా ఉన్న కరెంట్ పోల్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లను తకవద్దని సూచించారు.

ఆటో, బైక్ ఢీకొని విద్యార్థులకు గాయాలు

ధారూరు: ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి గాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం స్టేషన్‌ధారూరు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధారూరు బాలుర ఉన్నత పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులు ఆటోలో స్టేషన్‌ధారూరు గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో ఎదురుగా బైక్‌పై వస్తున్న ప్రవీణ్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఐదురుగు విద్యార్థులతో పాటు బైక్‌పై ఉన్న ప్రవీణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో ప్రమాదం జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాటు వివాదంలో రాజీవ్ కనకాలకు నోటీసులు

హయత్‌నగర్: ఓ ఇంటి స్థలం వివాదంలో సాక్షిగా హాజరు కావాలంటూ సినీ నటుడు రాజీవ్ కనకాలకు హయత్‌నగర్ పోలీసులు నోటీసులు అందజేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాముల గ్రామంలోని సర్వే నంబర్ 421లో 230 గజాల ఇంటి స్థలాన్ని రాజీవ్ కనకాల సినీ ఇండస్ట్రీకి చెందిన విజయ్‌చౌదరికి విక్రయించారు. ఇతను తన పరిచయస్తుడు మనోజ్‌రెడ్డి ద్వారా సదరు ప్లాట్‌ను ఎల్‌బీనగర్‌కు చెందిన శ్రవణ్‌రెడ్డి అమ్మారు. అనంతరం ప్లాటు పొజిషన్ లేకుండా ఆనవాళ్లను తొలగించారు. దీంతో ఆందోళనకు గురైన శ్రవణ్‌రెడ్డి ప్లాటు విషయమై పలుమార్లు విజయ్‌చౌదరిని అడిగారు. ప్లాటు చూపకుండా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారంటూ శ్రవణ్‌రెడ్డి పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్లాటు పూర్వాపరాలు తెలుసుకునేందుకు మొదటి ఓనర్ రాజీవ్ కనకాలకు నోటీసులు అందజేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

ఒకరికి స్వల్ప గాయాలు



ప్రమాదానికి గురైన కారు, విరిగిపడిన స్తంభం

మొయినాబాద్: అతివేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కారులో ఉన్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం లింగంపల్లి నుంచి అమ్డాపూర్ వైపు వెళ్తున్న కారు కాశీంబౌలి గేటు మూలమలుపు వద్ద అదుపుతప్పింది. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో పోల్ విరిగిపడింది. కారు పల్టీలు కొడుతూ కిందికి దూసుకెళ్లి ఆగిపోయింది. కారు ఢీకొట్టగానే విరిగిన స్తంభం తీగల నుంచి వేరుకావడంతో స్తంభం మాత్రమే కిందపడింది. లేదంటే పెను ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇక్కడున్న విద్యుత్ స్తంభాన్ని మరో చోటకు మార్చాలని కోరారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బురదమయంగా మార్కెట్



వికారాబాద్ కూరగాయాల మార్కెట్‌లో రైతుల అవస్థలు



ధారూరు: తరిగోపులలో ఇంట్లోకి చేరిన వరదనీరు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం, మండలంలోని ఆయా గ్రామాల్లో భారీగా వర్షం కురుస్తోంది. దీంతో గోధుమగూడ రైల్వే బ్రిడ్జి కింద వర్షపు నీరు రావడంతో కాసేపు రాకపోకలు నిలిచాయి. వికారాబాద్ మార్కెట్‌లో పూర్తిగా బురదమయంగా మారడంతో రైతులు ఇబ్బందులు పడుతూ కూరగాయలు విక్రయించుకున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ లీజును రద్దు చేయండి

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు
- నవాంద్గి సొసైటీ పెట్రోల్ బంక్ నిర్మాణంపై నీలినీడలు



వివాదాస్పద స్థలం

బషీరాబాద్: నాబార్డు నిధులు రూ.90 లక్షలతో నావంద్గి రైతు సహకార సొసైటీ చేపట్టిన పెట్రోల్ బంక్ నిర్మాణం వివాదాస్పదమైంది. ఈ బంక్ నిర్మాణం కోసం తీసుకున్న భూమి లీజు అక్రమమని అధికార పార్టీకి చెందిన నాయకుడు, బాధితుడు కోటప్ప మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది.

ఏం జరిగిందంటే..

పెట్రోల్ బంక్ కోసం నవాంద్గి సొసైటీ ఇండియన్ ఆయిల్ కంపెనీతో ఒప్పందం కుదర్చుకుంది. నిర్మాణానికి అవసరమైన భూమి కోసం కొర్విచెడ్‌కు చెందిన కోటప్పతో సొసైటీ వారు లీజు ఒప్పందం రాసుకున్నారు. సర్వేనంబర్ 4/2లో 225 గజాల భూమిని 2023 జూలైలో అప్పటి సొసైటీ సీఈఓ బందెప్ప అధికారికంగా అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలో రాజకీయ సమీకరణాలు మారాయి. దీంతో సొసైటీ పాలకవర్గం వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న అజయ్‌ప్రసాద్ సతీమణి, మాజీ ఎంపీపీ కరుణ పేరుపై లీజు ఇస్తూ తీర్మానం చేసింది. అయితే తన భూమికి నెలకు రూ.10 వేలు ఇస్తామని 25 సంవత్సరాల పాటు లీజు ఒప్పందం చేసుకున్న తర్వాత, ఎలాంటి నోటీస్ ఇవ్వకుండా ఎలా రద్దు చేస్తారంటూ బాధితుడు కోటప్ప కోర్టును ఆశ్రయించాడు. దీంతో బంక్ నిర్మాణం నిలిచిపోయింది.

ఇరకాటంలో సొసైటీ అధికారులు

పాలకవర్గం తీసుకున్న నిర్ణయాలతో అధికారులు ఇరకాటంలో పడ్డారు. సొసైటీ చట్టాల ప్రకారం పాలక వర్గంలో సభ్యుడు లేదా వారి కుటుంబానికి చెందిన భూములను లీజు కింద తీసుకోరాదని ఉండటంతో లీజు ఒప్పందం రాసుకున్న అధికారులు ఇరకాటంలో పడ్డారు. ఈవిషయమై ఉన్నతాధికారులు సంజాయిషీ కోరడంతో అయోమయానికి గురవుతున్నారు.

'అభయహస్తం' అందేనా?

- ప్రీమియం డబ్బులు వడ్డీతో సహా తిరిగివ్వాలని మహిళల అభ్యర్థన
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 1,18,712 మంది ఎదురుచూపు



మోమిన్‌పేట: అభయ హస్తం పథకంలో భాగంగా తాము చెల్లించిన డబ్బులను వడ్డీతో సహా తిరిగి ఇవ్వాలని మహిళలు కోరుతున్నారు. ఈ స్కీమ్ ఆగిపోయి పదకొండేళ్లు కావస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అప్పట్లో డబ్బులు కట్టిన 1,18,712 మంది ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై సర్కారు నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో స్తబ్దత నెలకొంది. ఉద్యోగులు విరమణ పొందిన తర్వాత పెన్షన్ పొందుతున్న మాదిరిగానే సామాన్య, పేద మహిళలు కూడా వృద్ధాప్యంలో పింఛన్ తీసుకోవాలనే సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 2009లో అభయహస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. 18 ఏళ్ల పైబడి 59 సంవత్సరాల లోపున్న డ్వాక్రా సంఘాల్లోని మహిళలు దీనికి అర్హులని పేర్కొన్నారు. వీరు నిత్యం రూపాయి చొప్పున జమ చేస్తే.. ప్రభుత్వం తరపున రూపాయి జత చేస్తారు. ఇలా అర్హత ఆధారంగా 60 సంవత్సరాలు పైబడిన మహిళలకు ప్రతినెలా రూ.500 నుంచి రూ.5 వేల పెన్షన్ అందుతుందని ప్రభుత్వం అప్పట్లో ప్రచారం చేసింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో 1,18,712 మంది పథకంలో చేరారు. నాలుగేళ్లు సజావుగా సాగిన లావాదేవీలు ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత స్తంభించిపోయాయి. సభ్యుల నుంచి ప్రీమియం తీసుకోలేదు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో 2,575 మంది మహిళలు అభయహస్తంలో సభ్యులుగా చేరారు. 2012- 13 మార్చి నాటికి వీరు చెల్లించి ప్రీమియం సొమ్ము రూ.5 లక్షలకు పైగానే ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం తమ డబ్బులు తిరిగి చెల్లించాలని సభ్యులు కోరుతున్నారు.

ఆదేశాలు రాలేదు



అభయహస్తం ప్రీమియం డబ్బుల చెల్లింపుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. గ్రామాలకు వెళ్తే తాము చెల్లించిన డబ్బులను వడ్డీతో కలిపి ఇవ్వాలని మహిళలు అడుగుతున్నారు.

– రాజు, ఐకేపీ ఏపీఎం, మోమిన్‌పేట